క్లుప్తంగా

రూ.9 వేల కోట్లతో ఎల్ఎన్జీ ఇంపోర్ట్ టెర్మినల్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ పోర్టులో లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్జీ) టెర్మినల్ నెలకొల్పేందుకు నార్వేకు చెందిన క్రౌన్ ఎల్ఎన్జీ సంస్థ ముందుకు వచ్చినట్లు ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీలో క్రౌన్ సీఈఓ స్వపన్ కటారియా, ఇండియన్ గ్యాస్ ఎక్స్ఛేంజ్ ఎండీ రాజేష్కుమార్లు ఈ మేరకు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారని, రూ.9 వేల కోట్లతో కాకినాడ సముద్ర తీరానికి 15 కిలోమీటర్ల దూరంలో ఈ టెర్మినల్ ఏర్పాటువుతుందన్నారు. ఈ టెర్మినల్ ద్వారా ఏడాదికి 7.2 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్యాస్ ఉత్పత్తి అవుతుందని, 2028 నాటికి ఈ పనులు పూర్తయ్యేలా సన్నాహాలు చేస్తున్నామన్నారు.

వైభవంగా నగర సంకీర్తన

బోట్క్లబ్: మాఘమాస సంకష్ట హరచతుర్థిని స్థానిక భోగి గణపతి పీఠంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి రమణరాజు ఆధ్వర్యంలో 53 మంది చతుర్థి ఉపాసకులతో ప్రత్యేక పూజలు చేశారు. మంగళ వాయిద్యాలు, పరమేశ్వర నామాలతో నగర సంకీర్తన, సహస్రనామ పారాయణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించి ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ విశ్రాంత జీఎం ప్రసాద్నాయుడు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు గొప్ప పరిపాలనా దక్షుడని 20వ ఏటనే విజయనగర సింహాసనాన్ని అధిష్టించారన్నారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, కుమార్ యాదవ్, బుద్ధరాజు సత్యనారాయణ, రెడ్నం రాజా, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకంపై దాడి

ట్రాక్టర్ సీజ్, ఇద్దరిపై కేసు నమోదు

పిఠాపురం: గ్రావెల్ అక్రమ తవ్వకాలపై పోలీసు, రెవెన్యూ అధికారులు ఆదివారం దాడి చేసి గ్రావెల్తో పాటు, ఒక ట్రాక్టర్ను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో తనకు వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లినట్లు ఆయన తెలిపారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామ శివారు పుష్కర, పోలవరం కాలువ గట్టు వెంట అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిని గుర్తించామన్నారు. వెంటనే గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్ను తనిఖీ చేసి ట్రాక్టర్ డ్రైవర్ ద్వారా వివరాలు తెలుసుకుని గ్రావెల్ తవ్వుతున్న ప్రాంతానికి వెళ్లగా అక్కడ మట్టిని జేసీబీతో లోడ్ చేసిన వజ్రకూటానికి చెందిన వాసా రాజు జేసీబీతో సహా పరారయ్యాడన్నారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ కోరుమిల్లి సురేష్ను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్ను సీజ్ చేసి జేసీబీ డ్రైవరు వాసా రాజుపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కాపులపాలెంలో నేడు వీరభద్రుని సంబరం

తాళ్లరేవు: మండల పరిధిలోని కాపులపాలెం గ్రామంలో నేతికుండలో వెలసిన నేతిలో వీరన్నబాబు సంబరాన్ని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వీరభద్ర దేవస్థానం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దీనిలో భాగంగా ఉదయం 8 గంటలకు పవిత్ర గోదావరి నదిలో స్నానం, 10 గంటల నుంచి వీరన్నబాబు గద్దె వద్ద స్వామివారి దర్శనం, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరుగుతాయన్నారు. రాత్రి 8 గంటల నుంచి వీరముష్టుల ఆధ్వర్యంలో వీరనాట్యం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

కాకినాడ అధికారుల ఫోన్ నెంబర్లు

మున్సిపల్ అధికారులు	
కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్వో	9949432320
ఎస్ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084
సిటీ మిషన్ మేనేజర్	7901610084
పంచాయతీ అధికారుల ఫోన్ నెంబర్లు	
డివిజినల్ పంచాయతీ అధికారి	9849903188
ఫుడ్ ఇన్స్పెక్టర్	9494297564
ఆర్డబ్ల్యూఎస్ ఈఈ	9100121109
జిల్లా వ్యవసాయశాఖాధికారి	8331056483
దేవదాయశాఖ	9290145126
డివిజన్ ఇన్స్పెక్టర్	
గృహ నిర్మాణశాఖ డీఈ	7093930577
పశుసంవర్ధకశాఖ జేడీ	9989932835
డీసీసీబీ జీయం	8341208227
జిల్లా సహకారశాఖ అధికారి	9100109168
జీజీహెచ్లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు	
సూపరింటెండెంట్	98499 03870, 0884 2302001
సీఎస్ ఆర్ఎంవో	98499 03871
డీసీఎస్ ఆర్ఎంవో	98499 03871
ఆర్ఎంవో	0884 2302003
డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్	0884 2302002
అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)	98499 03873, 0884 2302004
పోలీస్ అవుట్పోస్ట్	83329 57924

సిటీ స్మార్ట్.. గోతులతో వరస్ట్

- ప్రమాద భరితంగా కల్వర్టులు
- రంధ్రాలు, గోతులతో అధ్వానం
- గాయాలపాలవుతున్న ప్రజలు
- పాడవుతున్న వాహనాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



అశోక్నగర్ సాయిబాబా ఆలయం పక్కవీధిలో కల్వర్టుపై ప్రమాదకరంగా ఉన్న రంధ్రం



చందన బ్రదర్స్ వెనుక వీధిలో పాడైన కల్వర్టు

బోట్క్లబ్: పేరుకే స్మార్ట్ సిటీ. నగరంలో సదుపాయాలు మాత్రం అంతంతే. గోతుల రోడ్లు, పాడైన కల్వర్టులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని పలు వీధుల్లో కల్వర్టులు, వాటి శ్లాబులు పాడై రంధ్రాలు పడి అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు ప్రమాదాల పాలవుతున్నారు. నగరంలో విద్యుత్ నగర్, అశోక్ నగర్, గాంధీనగర్ రామారావు పేట, జగన్నాథపురం, రెవెన్యూకాలనీతో పాటు పలు ప్రాంతాలలో ఈ కల్వర్టులు ప్రమాదభరితంగా ఉన్నాయి. ఈ కల్వర్టులు పాడై నెలలు గడుస్తున్నా కార్పొరేషన్ అధికారులు వీటికి మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. స్థానిక అశోక్ నగర్ షిరిడి సాయిబాబా ఆలయం పక్క వీధిలోని కల్వర్టుకు రంధ్రం పడి సుమారు రెండు నెలలు కావస్తున్నా ఇంకా మరమ్మతులు చేయలేదు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గోతిలో పడిన అశోక్నగర్కు చెందిన నాగబాబు అనే వ్యక్తికి బైక్ మరమ్మతులతో పాటు, అతని గాయాలకు వైద్యం చేయించుకుంటే రూ.7 వేలు ఖర్చయ్యింది. అధికారులు ఇటువంటి వాటిని సత్వరం మరమ్మతు చేయాల్సి ఉంది.

రాత్రి సమయంలో ప్రమాదాలు ఎక్కువ

రాత్రి సమయాల్లో ప్రయాణించేవారు పలుచోట్ల కల్వర్టులు పాడైన విషయాన్ని గుర్తించక గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పాడైన కల్వర్టుల వద్ద ఎటువంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడంతో ప్రయాణికులకు దినదిన గండంగా తయారైంది.

పాలకవర్గం లేక మరింత సమస్య

గతంలో ఏ డివిజన్లో అయినా కల్వర్టుల పాడైతే ఆయా వార్డు కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకు వచ్చేవారు. కౌన్సిల్ సమావేశం లేకపోయినా స్థానిక కార్పొరేటర్ ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే కల్వర్టులకు మరమ్మతులు చేయించేవారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ పాలకవర్గం లేకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే అన్నట్టు ఉన్నాయి. తమ సమస్యను అధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కరించడం లేదని పలు వార్డుల ప్రజలు వాపోతున్నారు.

ప్రమాద భరితంగా గోతులు



ఇటీవల అశోక్నగర్ పనిమీద వెళ్లి తిరిగి వస్తూ అక్కడి కల్వర్టు వద్ద గోతిలో ద్విచక్రవాహనంతో పాటు పడిపోయా. దీంతో చెయ్యి బెణికింది. మోకాళ్లు కొట్టుకుపోయాయి. ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నాను. బండి హెడ్లైట్ డోమ్ పగిలిపోయింది. మరమ్మతులకు రూ.3 వేలు ఖర్చు పెట్టాను.

సతీష్, ప్రయాణికుడు

మరమ్మతులు చేస్తాం

నగరంలో పలు ప్రాంతాల్లో కల్వర్టులు పాడైపోతున్నాయి. వాటికి దశల వారీగా మరమ్మతులు చేస్తున్నాం. మా దృష్టికి వచ్చిన కల్వర్టుల మరమ్మతులకు నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఇప్పటికే కొన్నింటికి నిధులు మంజూరయ్యాయి. వాటికి మరమ్మతు చేస్తాం.

– కామేశ్వరరావు, ఎస్ఈ, నగరపాలకసంస్థ

నగరంలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్



టిడ్కో గృహాల్లో తనిఖీలకు సమాయత్తమైన పోలీస్ బృందాలు

కాకినాడ క్రైం: నగరంలో పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో అదనపు ఎస్పీ, కాకినాడ ఎస్డీపీఓ దేవరాజ్ మనీష్ పాటిల్ పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ జరిగింది. కొద్ది రోజులుగా నగరంలో చోటు చేసుకుంటున్న వరుస దొంగతనాలు, హత్యోదంతాలతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న సున్నిత అంశాల నేపథ్యంలో నిర్వహించిన ఈ కార్డెన్ సెర్చ్ ప్రాధాన్యం సంతరించుకుంది. కాకినాడ టూ టౌన్, పోర్ట్ సీఐలు మజ్జి అప్పలనాయుడు, సునీల్ల సంయుక్త ఆధ్వర్యంలో 50 మంది పోలీసులు, స్పెషల్ పార్టీ బృందాలు ఈ ఆపరేషన్లో పాల్గొన్నాయి. కాకినాడ 12వ డివిజన్ స్వర్ణాంధ్ర కాలనీలో టిడ్కో గృహాల లక్ష్యంగా తనిఖీలు నిర్వహించారు. పలు ఇళ్లలో కొందరు గృహస్తులు, హిజ్రాలు అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంలో ఆయా ఇళ్లను సోదా చేసి హెచ్చరికలు జారీ చేశారు. రికార్డులు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

భజే భావనారాయణం

- సర్పవరంలో వైభవంగా తిరునాళ్లు
- మాఘ ఆదివారం పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక ఆలంకరణలో స్వామి వారు



ఆలయ ప్రాంగణంలో నైవేద్యం కోసం పొంగలి తయారుచేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో భావనారాయణ స్వామి వారు



స్వామివారి దర్శనానికి వెళ్తున్న భక్తజనం

కాకినాడ రూరల్: మాఘ మాసం సందర్భంగా సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. మూడో ఆదివారం స్వామి వెలసిన రోజు కావడంతో వేలాదిగా భక్తులు తరలివచ్చి పూజలు చేయించుకున్నారు. స్వామివారిని పూలతో ప్రత్యేక అలంకరణ చేయడంతో భక్తులు చూసి తరించారు. ఇక్కడి భావనారాయణుని దర్శించుకుంటే 108 నారాయణ క్షేత్రాలను దర్శించుకున్నంత ఫలమని పురాణాలు చెప్పుండడంతో పలు ప్రాంతాల నుంచి స్వామి వారి దర్శించుకుని మాఘ మాస తిరునాళ్లలో పాల్గొంటారు. ఆలయం ప్రాంగణంలో ఉదయం మహిళలు ఆవు పిడకలతో నెచ్చలి వేసి దానిపై ఆవుపాలతో పొంగలి తయారు చేసి సూర్య భగవానుడికి నైవేద్యం సమర్పించి పూజలు చేసుకున్నారు. ఆరోగ్య ప్రదాత సూర్య భగవానుడిని ప్రత్యక్ష నారాయణుడిగా కొలిచి భక్తులు నమస్కారాలు చేసుకున్నారు. వేలాదిగా వచ్చిన భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. వేలాది వచ్చిన భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహించారు. దేవదాయ శాఖ అధ్వర్యంలో పలువురు అధికారులు, సిబ్బంది భక్తులకు ఇబ్బంది లేకుండా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సుమారు 50 వేల మంది భక్తులు హాజరయ్యారన్నారు. సాయంత్రం 6 గంటలకు దర్శనాలు, సేవలు, ప్రసాదం విక్రయం, అన్నదాన విరాళాల రూపంలో సుమారు రూ.5 లక్షలు ఆదాయం లభించిందని తెలిపారు. మూడో ఆదివారం ఆలయానికి వచ్చిన భక్తులకు పంతం నానాజీ, అరుణ దంపతుల సహకారంతో సుమారు 25 వేల మందికి అన్న ప్రసాదం ఉచితంగా అందజేశామన్నారు.

నేటి నుంచి తాగునీటి సరఫరాకు అంతరాయం

కమిషనర్ భావన

బోట్క్లబ్: నగరంలో సోమవారం నుంచి ఈ నెల 20 వరకూ పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు నగర పాలకసంస్థ కమిషనర్ భావన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చంపేట ఏడీబీ రోడ్డులో నేషనల్ హైవే అథారిటీ చేపట్టిన పనుల్లో భాగంగా సామర్లకోట నుంచి శశికాంత్నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్కు వచ్చే పైపులైన్లకు అనసంధాన ప్రక్రియ చేపడుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. 21వ తేదీ సాయంత్రం నుంచి తాగునీటి సరఫరా యథావిధిగా జరుగుతుందన్నారు. శశికాంత్నగర్ నుంచి తాగునీటి సరఫరా జరిగే ప్రాంతాలైన శశికాంత్నగర్, శ్రీవిద్యాకాలనీ, భాస్కర్ నగర్, దుమ్ములపేట, సాంబమూర్తి నగర్, గైగోలుపాడు, 1 నుంచి 13 డివిజన్లు, 49, 50 డివిజన్లలో తాగునీటి సరఫరాకు అంతరాయం వస్తుందన్నారు. ప్రజల కోసం ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. తాగునీరు అవసరమైన వారు 98484 71415, 63013 87834 నెంబర్లలో సంప్రదించవచ్చునన్నారు.

ఏడీబీ రహదారి విస్తరణ పనుల పరిశీలన

కాకినాడ రూరల్: పోర్టు కనెక్టివిటీగా చేపడుతున్న ఏడీబీ రోడ్డు విస్తరణ పనులను జాతీయ రహదారుల అథారిటీ పీడీ సురేంద్రనాథ్ పరిశీలించారు. ఏడీబీ రోడ్డులో రాక్ సిరామిక్ నుంచి యాంకరేజ్ పోర్టు వరకు సుమారు 26కిలో మీటర్ల మేర నాలుగు లైన్లగా రహదారి విస్తరణ పనులు చేపట్టారు. రెండు ప్యాకేజ్ల్లో చేపడుతున్న పనుల్లో భాగంగా అచ్చంపేట జంక్షన్ వద్ద గోకుల్ గార్డెన్ నుంచి పోర్టు వరకు రహదారి విస్తరణ పనులు చేస్తున్నారు. ఈ పనుల్లో సూర్యారావుపేట లైట్ హౌస్, సీ పోర్టు వద్ద చేపట్టిన పనులకు సాంకేతిక సమస్యలు ఉండడంతో హైవే అథారిటీ అధికారులతో పాటు పీడీ సురేంద్రనాథ్ పరిశీలించి కాంట్రాక్ట్ సంస్థ ఆర్కే కన్స్ట్రక్షన్ ప్రతినిధులు సత్య రమేష్ తదితరులతో చర్చించారు.



సీ పోర్టు వద్ద తలెత్తనున్న సాంకేతిక సమస్యలపై చర్చిస్తున్న సురేంద్రనాథ్

23న ప్రభుత్వ పాఠశాల శతాబ్ది వేడుకలు



వేడుక ఏర్పాట్లపై సమావేశమైన పూర్వ విద్యార్థులు

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ హైస్కూల్ శతాబ్ది వేడుకలను విజయవంతం చేయాలని పూర్వ విద్యార్థుల సంఘ కార్యదర్శి కొప్పిరెడ్డి సత్యనారాయణమూర్తి పిలుపు నిచ్చారు. ఈ నెల 23న నిర్వహించనున్న వేడుకలను పురస్కరించుకుని ఆదివారం గ్రంథం రామకృష్ణ కాన్వెంట్ ఆవరణలో పూర్వ విద్యార్థుల సంఘ ముఖ్య నాయకులు ఆయన అధ్యక్షతన సమావేశమయ్యారు. పిఠాపురం రాజా రాజా జగపతి సూర్యారావు బహదూర్ ఆధ్వర్యంలో 1924లో స్థాపించి 2024తో వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. దేశ, విదేశాలల్లో ఉన్న అనేక మంది పూర్వ విద్యార్థులకు మూడు నెల రోజులుగా ఆహ్వానాలు పంపుతున్నామని కొప్పిరెడ్డి వివరించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులను సత్కరించనున్నామని, ఈ మేరకు సుమారు 500 మందిని గుర్తించినట్టు ఆయన తెలిపారు. జూనియర్ కళాశాలలో చదువుకున్న వారు కూడా ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు. 23వ తేది ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే వేడుకలలో అలనాటి గురువులను, వివిధ పదవుల్లో ఉన్న, పదవీ విరమణ చేసిన ప్రముఖులను సైతం సత్కరించనున్నట్టు పూర్వ విద్యార్థి దవులూరి సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు వద్దిపర్తి రాజేశ్వరరావు, కె. పద్మనాభం, బిక్కిన రంగ, యంద్రు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పాతికేళ్ల నాటి ముచ్చట్లు



పనసపాడులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సామర్లకోట: పెద్దాపురం మండలంలోని కాండ్రకోట జెడ్పీ హైస్కూల్ 2000 సంవత్సరం బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పనసపాడులో ఆత్మీయంగా కలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని నిర్మలాదేవి, ఉపాధ్యాయులు వీర్రాజు, రామకృష్ణలను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఆనాటి ముచ్చట్లు గుర్తుచేసుకుని వారంతా సందడి చేశారు. సుమారు 50 మంది నాటి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రస్తుతం వారు ఏయే వృత్తుల్లో, ఏయే ఉద్యోగాల్లో ఉన్నదీ వివరాలు పరస్పరం పంచుకుని, కుటుంబాల యోగక్షేమాలు తెలుసుకున్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

- 15మంది అరెస్టు
- రూ.87 వేల నగదు, నాలుగు బైక్ల స్వాధీనం

పెద్దాపురం: మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న పేకాట స్థావరాలపై స్థానిక పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు చేశారు. ఎస్ఐ మౌనిక ఆధ్వర్యంలో రెండు బృందాలుగా నిర్వహించిన ఈ దాడుల్లో మండలంలోని సీబీ దేవం, జె.తిమ్మాపురం, పులిమేరు, చదలాడ గ్రామాల సరిహద్దు ప్రాంతాలలో జూదమాడుతున్న వారిపై ఉక్కుపాదం మోపారు. ఆయా గ్రామాల స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామని ఎస్ఐ మౌనిక తెలిపారు. ఈ దాడుల్లో 15 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి సుమారు రూ.87,750 నగదు, నాలుగు బైక్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు తరలించనున్నామని ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాఘవులు ప్రచారం

కాకినాడ సిటీ: పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు ఆదివారం నగరంలో విస్తృత ప్రచారం చేశారు. నగరంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేస్తున్న పట్టభద్రులను కలుసుకుని శాసనమండలిలో పీడీఎఫ్ కృషిని వివరించారు. పీడీఎఫ్ ప్రజాపక్షాన నిలుస్తుందని వివరించారు. ప్రస్తుత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) స్థానంలో తనను ప్రతిపాదించాలని రాఘవులు అభ్యర్థించారు. కాకినాడ నగర పరిసర ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్, మహిళలతో పాటు ముఖ్యంగా నిరుద్యోగ పట్టభద్రులు తనకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



వాకర్లను కలిసి గ్రాడ్యుయేట్ ఓటు అభ్యర్థిస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి రాఘవులు

ఆటోను ఢీకొన్న కారు

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై మండలంలోని ధర్మవరం సమీపంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఆటో డ్రైవర్కు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. ఉల్లిపాయ లోడుతో ప్రత్తిపాడు నుంచి కత్తిపూడి వైపు వెళ్తున్న అటోను ధర్మవరం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన డ్రైవర్ నిలుపుదల చేశాడు. కాగా రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖ వెళ్తున్న కారు నిలిచిఉన్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో బోల్తా పడగా, డ్రైవర్ మొయిళ్ల శివకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని ప్రత్తిపాడు పోలీసులు తెలిపారు.



కారు ఢీకొనడంతో బోల్తా పడిన ఆటో

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం



నృత్యాభినయంతో ఆకట్టుకున్న చిన్నారులు

కాకినాడ రూరల్: స్థానిక బీచ్ రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో హాజరైన సందర్శకులు శిల్పారామాన్ని సందర్శించారు. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా కాకినాడకు చెందిన జగన్మాత నాట్యాలయం పల్లా వీర వెంకట సత్యవతి బృందం పలు నృత్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. చిన్నారులను శిల్పారామం ఇంచార్జి పరిపాలన అధికారి సి.మోహన్తేజ అభినందించి సత్కరించారు.

కరప మండల అధికారుల ఫోన్నంబర్లు

ఎంపీడీఓ	9346790319
తహసీల్దార్	9849903908
ఈఓ. పీఆర్ ఆర్డీ	9849352293
మండల ఇంజనీరింగ్ అధికారి	8886865417
మండల వ్యవసాయాధికారి	8331056589
ఎంఈఓ–1	8008293994
ఎంఈఓ–2	8919940656
హౌసింగ్ ఏఈఈ	7093930450
ఉపాధిపథకం ఏపీఓ	7093998259
వెలుగు ఏపీఓం	9959989273
ఎలక్ట్రికల్ ఏఈ	9440812638
ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ	9603007219
ఇరిగేషన్ ఏఈఈ	9704651826
డ్రెయినేజీశాఖ ఏఈఈ	9963744219
ఆర్అండ్బి ఏఈఈ	9440818530
కరప పీహెచ్సీ డాక్టర్	8096940176
వేళంగి పీహెచ్సీ డాక్టర్	9962553545
పశుసంవర్ధకశాఖ ఏడీఏ	9490047668
నడకుదురు వెటర్నరీడాక్టర్	9652547579
వేళంగి వెటర్నరీ డాక్టర్	8332973558
అరట్లకట్ట వెటర్నరీ డాక్టర్	9494671642
ఫిషరీస్ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్	9704512131
ఐసీడీఎస్ సూపర్వైజర్	9492600313
కరప ఎస్ఐ	9440796557
తాళ్లరేవు ఎక్సైజు సీఐ	9440902407